**వారం** రోజులని చెప్పి, నెల రోజుల దాకా పుట్టింట్లో మకాం వేయటం జగదీశ్వరికి మామూలే.

శివానందానికి జగదీశ్వరితో పెళ్ళయి అయిదేళ్ళయింది. ఇప్పటికో అమ్మాయో, అబ్బాయో పుడితే జగదీశ్వరికి కాలక్షేపంగానూ, శివానందం ప్రాణానికి హాయిగానూ ఉండేది.

ఇద్దరి వంట ఎంతసేపు చెయ్యాలి? చదివేందుకు పత్రికలు, నవలలు చాలక పూసుపోక ఏదో ఒక సమస్య సృష్టించుకుని, సాయంత్రం భర్త ఇంటికి రాగానే వీలయితే ఒక గొడవ పెట్టుకుందామని చూస్తున్నట్లు కనిపిస్తుంది జగదీశ్వరి—శివానందం కళ్ళకి.

మూడు నెలలు తిరిగాయంటే చాలు. ఈ మహాతల్లి పుట్టింటి ప్రయాణం ఎప్పుడో, కొన్నాళ్ళు అలా వెళితే నాకు రిలీఫ్ అనుకుంటూ డతను. ఆమె లేకున్నా భోజనం సమస్య లేదు. చేస్తున్నది మంచి ఉద్యోగమే. బాగా సంపాదన ఉంది. రోజుకు పాతిక రూపాయలయినా ఖర్చుచేసి, వూర్లో ఉన్న మంచి హోటళ్ళని పావనంచేసి కడుపు నింపుకుంటాడు. తోడుగా స్నేహితులు ఉండనే ఉంటారు.

ఎప్పటిలాగే ఈ సారి ''అమ్మను చూడాలనుంది, వూరెళతానండీ'' అని జగదీశ్వరి అడగ్గానే అదే పదివేలు అన్నట్లు, తీరిక చేసుకుని స్వయంగా రైలెక్కించి వచ్చాడు.


తమాషా ఏమిటంటే వారం తిరిగేసరికి, ఒక శుభోదయాన వూరి నుంచి తిరిగి వచ్చేసింది జగదీశ్వరి.

హాయిగా తొమ్మిదింటిదాకా నిద్రపోతూ, నిద్రలోనే లేచి తలుపు తీశాడేమో, ఉండబట్టక అడిగేశాడు శివానందం—''అప్పుడే వచ్చేశావేం?'' అని.

జగదీశ్వరి ఒళ్ళు మండిపోయింది.

''రాకుండా అక్కడే శాశ్వతంగా ఉండిపోయేందుకు నా కేం ఖర్మ?'' అంటూ విసురుగా లోపలికి నడిచింది.

అప్పటికిగాని మత్తు వదిలి, తను అడిగినదాంట్లో ఉన్న తప్పేమిటో అర్థం కాలేదు శివానందానికి. నిర్లజ్జంగా పిల్లిలా వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి, ''కూరగాయలు తేవాలా?'' అని అడిగాడు—వంటగది శుభ్రంచేసుకుని, సర్దుకుంటున్న జగదీశ్వరిని.



# ఈడు జోడు

'వింధ్యవాసిని'

అతను కాఫీ తాగి బయటకు వెళ్ళాక తన కాఫీ కప్పు చేతిలోకి తీసుకుంది. ఒకగుక్క తాగేసరికి తెలిసి పోయింది చక్కెర వేయటం మరిచానని. పాపం అలాగే తాగేసి పోయారు—నే కోపంలో ఉన్నానని భయంతో అనుకుంది జాలిగా. కోపం అంతా కరిగిపోయింది.

ఆవేళ ఆదివారం. తగినంత విశ్రాంతి, భార్యామణి కబుర్లతో కాలక్షేపమూ అనుకుంటూ, కూని రాగాలు తీస్తూ స్నానం చేశాడు శివానందం.

స్నానాల గదిలోంచి వస్తూ జగదీశ్వరి చపాతీలు కాలుస్తోండటం చూశాడు. ''టిఫిన్ చపాతీ చేస్తున్నావా?'' అడిగాడు.

''వూఁ''...

''ఉల్లిగడ మసాలా కూర చేశావా?''

చపాతీలోకి ఉర్లగడ్డల మసాలా కూర వేసుకుని తినటం ఇష్టం శివానందానికి. ''ఊహూ, బీన్స్ తాళింపు వేశా'' అంది జగదీశ్వరి.

''కాంబినేషన్ మార్చేశావేం?'' అంటూ, లుంగీ కట్టుకుని వచ్చి టేబిల్ ముందర కూర్చున్నాడు.

పళ్ళెంలో పొడిపొడిగా కనిపిస్తున్న జొన్నరొట్టెల్లాంటి చపాతీలనిచూసి ''ఇవేమిటి? ఇలా ఉన్నాయే?'

''నూనె తక్కువ వేశా లెండి.''

''అదేం—నూనె అయిపోయిందా? చెబితే తెచ్చే వాణ్నిగా'' అంటూ అసంతృప్తిగా పళ్ళెం ముందుకు లాక్కుని కూర వడ్డించుకున్నాడు.

ఉడకబెట్టి నీళ్ళు ఒంచేసి బీన్స్ ముక్కలకి కొద్దిగా పచ్చి కొబ్బెర మాత్రం కలిపి పెట్టేసినట్లుంది కూర. ఆ కూరతో రెండు చపాతీలు తినటం కూడా కష్టం అయిపోయింది శివానందానికి.

చేతులు కడుక్కుంటూ, ''ఏమిటో కడుపు నిండినట్లే లేదు'' అన్నాడు.

''పోన్లెండి, మంచిదేగా?''

అదేమిటలా అంటోందే అనుకున్నాడు. అతని కేమీ అర్థం కాకుండా ఉంది.

న్యూస్ పేపర్ చూస్తూ, ఏమిటో కాస్త ముభావంగా ఉంది జగద అనుకుంటూ, మధ్య మధ్య నిద్రపోతూ మధ్యాన్నం దాకా కాలం గడిపాడు శివానందం.

''ఆదివారం వస్తే నిదరపోవటం తప్పిస్తే మరో పనిలేదు. లేవండి భోంచేద్దురు'' అంటూ జగదీశ్వరి కేకలు వేస్తూంటే లేచి కూర్చున్నాడు. ఉదయం కడుపునిండ నందుకేమో బాగా ఆకలిగా ఉంది.

''పద పద'' అంటూ లోపలికి నడిచాడు.

వేడిగా పొగలు కక్కుతున్న అన్నం వడ్డించిన పళ్ళాన్ని దగ్గరికి లాక్కుంటూ, ''నెయ్యి తీసు కొచ్చావా పూర్నించీ'' అన్నాడు, నెయ్యి గిన్నెకోసం వెదుకుతూ.

''ఊహూ. లేదు. తీసుకురాలే దీసారి.''

పోనీ అనుకుని, చుట్టూ గిన్నెల్లో ఉన్న పదార్థాలని పరిశీలించాడు. ఒకదాన్లో నీళ్ళగా ఉన్న పులుసు, మరోదాన్లో బెండకాయ గుజ్జు, ఇంకో దాన్లో రసం—ఇంతే ఉన్నాయి. ఒక చిన్న ప్లేట్‌లో ఒక్కటే అప్పళం కనిపించింది.

అవన్నీ చూసేసరికి నీరసం వచ్చేసింది శివానందానికి. ముద్ద పప్పు, వేపుడు కూర ఉంటే గానీ అతనికి భోజనం చేసినట్లుండదు. అప్పళా లయితే కనీసం అరడజను ఉండాలి.

తెల్లమొహం వేసుకుని చూస్తూ కూర్చు న్నాడు. ''భోంచేయండి, ఏమిటలా చూస్తున్నారు?'' అంది జగదీశ్వరి.

కోపం తన్నుకొస్తోంది శివానందానికి. ''ఎవరి కోసం చేశా వీ పత్యం భోజనం. నువే తిను. నే బయట కెళ్ళొస్తా'' నంటూ లేచి పోబోయాడు.

''మీ రిప్పుడు హోటల్‌కి వెళ్ళారంటే నా మీద ఒట్టే!'' బాంబు పేల్చేసి నిశ్శబ్దంగా నిలుచుంది జగదీశ్వరి.

''ఇదేమిటి పిచ్చీ. అవునూ ఉదయంనుండి చూస్తున్నా వీ తంతు— ఏమీ అర్థం కాకుండా ఉంది. తిండి లేకుండా మాడ్చాలని ఉన్నావా ఏమిటి నన్ను?'' నిలదీశాడు.

''అవున్లెండి. మిమ్మల్ని తిండి లేకుండా మాడ్చా లని చూస్తున్నట్లే కనిపిస్తుంది కానీ, నన్ను మీ రెప్పుడర్థం చేసుకున్నారు. ఇలా రండి'' అంటూ, అతని చేయి పట్టుకుని పడక గదిలో ఉన్న నిలువుటద్దం దగ్గరికి లాక్కువెళ్ళింది.

తను నిల్చుని, పక్కన అతన్ని నిలుచోబెట్టి— ''ఒక్కసారి చూడండి అలా'' అన్నది విసురుగా.

భార్యకి పిచ్చేమయినా పట్టిందా అని భయం వేసింది శివానందానికి. బెదురుగా అద్దంలోకి చూశాడు.

తను కాస్త లావు అని అతనికి తెలుసు. కాకపోతే పెళ్ళి అయిన అయిదేళ్ళలో పొట్ట సైజు పెరిగి, కాస్త బొజ్జ పొడుచుకొచ్చినట్లు కనిపిస్తోంది—అంతే! జగదీశ్వరిమటుకు పెళ్ళినాడు ఎలా ఉందో ఇప్పటికీ అలాగే సన్నగా, పిట్టలాగా ఉంది. సరిగ్గా తన సైజులో సగం కనిపిస్తుంది. దానికేముంది! ఒక్కొక్కరి శరీర తత్వం అది అనుకున్నాడు.

''మనిద్దరికీ ఈడు జోడు ఏమయినా కని పిస్తోందా?'' పదునెక్కిన బాణంలా వచ్చి తన్ని గాయపర్చబోయిన ఆ మాటలని శివానందం తేలిగ్గా తీసుకుని, ''పెళ్ళయిన అయిదేళ్ళకి మనకి ఈడు జోడు సరిలేదని ఎవరోయ్ అన్న వాళ్ళు'' అన్నాడు, విషయం ఏమిటో మూలం నుండి తెలుసుకోవాలనే ప్రయత్నంలో.

మూతిముడుచుకుని మంచం మీద కూర్చుంటూ, ''మొన్న ఆమధ్య మనం తీసుకున్న ఫోటో చూసి వూర్లో మా వాళ్ళంతా ఎగతాళి చేశారు.''

సమస్య పెద్దదే అనుకుంటూ, ''అందుకని నాకు తిండి తక్కువ పెడితే, నేను సన్నబడతా ననుకున్నావా? పిచ్చీ, నీ కెవరు చెప్పిం దీ ప్లాను! తినటం, తినక పోవటానికీ—లావు, సన్నల అవడానికి ఏం సంబంధం లేదు తెలుసా? పైనుంచి తిండి తగ్గిస్తే—ఏ రోగమో వస్తే మళ్ళీ నీవే వేగాలి కదా!'' అన్నాడు శివానందం, జగదీశ్వరిపైన తన మాటల ప్రభావం గమనిస్తూ.

ఆలోచనలో పడింది జగదీశ్వరి. ''ఏమాట కామాట చెబుతారు. మరయితే మీరు సన్నబడే మార్గమే లేదంటారా?''

ఇరుకునబడ్డాడు శివానందం. నిజానికి ఆమెది పాపం చాలా చిన్న కోరికే! తన్ని భర్త పక్కన చూసి నలుగురు ఈడు జోడయిన జంట అనాలని ఆమె ఆశ. అలాంటప్పుడు ఆమెను నిరుత్సాహపరచి, తను బ్రతకగలడా?

''ఎక్సర్‌సైజు చేస్తే సన్న బడతా ననుకుంటాను.''

''కరెక్ట్. బాగా చెప్పారు. మావారు భలే మంచివారుట. రోజూ ఒక గంటసేపు రన్నింగ్ చేయటూ? దాన్ని మించిన సులభమయిన వ్యాయామం ఏముంది చెప్పండి?'' భర్త నడుం చుట్టూ చెయ్యివేసి, భుజంమీద గెడ్డం ఆన్చుకుని గోముగా అడిగింది.

అంత ముద్దుగా ఏది అడిగితే మాత్రం కాదన గలడు శివానందం. ''అలాగే రేపే మొదలు పెడతా—సరేనా...కానీ మొదటి రోజే గంటంటే కష్టం, జగదా! పావుగంటతో మొదలు పెడతాను. మరి నాకు నెయ్యేసి అన్నం పెడతావా? అట్లే రెండు ఎగ్స్ ఉన్నాయేమో—ఆమ్లెట్స్ వేసెయ్యి వేగిరం. చెడ్డ ఆకలిగా ఉంది'' అని తొందర పెట్టాడు.

● ● ● ●

తెల్లవారు జామున అయిదు గంటలకి అలారం గణగమని మోగుతోంది.

ఉలిక్కిపడి లేచి కూర్చుంది జగదీశ్వరి. పక్కనే గుర్రుపెట్టి నిద్రపోతున్న శివానందాన్ని తట్టి లేపింది—''ఏమండీ! లెయ్యరూ'' అంటూ.


''ఏమిటి, జగదా? అర్థరాత్రి నిద్రపోనివ్వకుండా...'' మూలుగుతూ అలాగే పడుకున్నాడు శివానందం.

''అర్థరాత్రేమిటి? అయిదు గంటలయిపోతే! లేవండి రన్నింగ్‌కి వెళుదురు గానీ.''

వరిగ్గా అప్పుడే ఒక అనుమానం వచ్చింది జగదీశ్వరికి—ఇంత నిద్రలోంచి లేచిన మనిషి అసలు నిజంగా పరిగెత్తుతాడా, లేక బయటెక్కడో నిలుచునే నిద్రపోయి అరగంటాయక ఇల్లు చేరేవా? అని వెంటనే తనూ అతని వెంట వెళ్ళాలని నిర్ణయించుకుంది. ఫరవాలేదు. ఇంకా చీకటిగానే ఉంది, ఎవరు చూస్తారు? అనుకుంటూ, భర్తని బలవంతంగా నిద్రలేపింది.

శివానందం ముఖం కడుక్కుని, భార్య ప్రత్యేకంగా తెప్పించిన షార్ట్సు, టీ షర్టు వేసుకుని తయారు అయాడు. తనవెంట బయటికొచ్చి, ఇల్లు తాళం పెడుతున్న జగదీశ్వరిని చూసి, "ఏమిటే...నువ్వూ వస్తున్నావా, జగదా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును. పదండి. పాపం అలవాటు అయేదాకా మీకు బోర్ కదా?" రెడీ వన్, టూ, త్రీ, గో—




అనుకుని ఇద్దరూ నిర్మానుష్యంగా ఉన్న సందువెంట పరుగు మొదలు పెట్టారు

రెండు నిముషాలు వేగంగా పరిగెత్తేసరికి ఆయాసం ఒచ్చేసింది శివానందానికి. గుండె వేగంగా కొట్టుకుంటోంది. కాళ్ళు ముందుకు వెళ్ళలేమని మొరాయించాయి. ఇద్దరూ కొంచెంసేపు ఒక కాంపౌండ గోడనిఆనుకుని నిల్చుని ఆలుపు తీర్చుకున్నార,.

"ఇలాకాదు. చిన్నగా, గబగబా నడిచినంతవేగంగా పరుగెడ్తే సరిపోతుంది" సలహా చెప్పింది జగదీశ్వరి.

ఈ సారి ఆగకుండా అరమైలు దూరంలో ఉన్న గాంధి విగ్రహం, సర్కిల్ వరకూ వెళ్ళారు. ఇంక వెనక్కి తిరుగుదామని అనుకునే లోపల, సర్కిల్ దగ్గర వచ్చి గడ్డిలో విశ్రాంతి తీసుకుంటున్న వీధి కుక్కలు రెండు—వీళ్ళ అలికిడి విని లేచి కూర్చుని మొరగటం ప్రారంభించాయి.

శివానందం ఒక్కసారి రెండు కుక్కల వైపు చూసి "పద పోదాం" అన్నాడు. ఇద్దరూ చిన్నగా పరిగెత్తటం చూసి, కుక్కలు రెండూ కాళ్ళు జాడించుకుని, మొరుగుతూనే వీళ్ళ వెంటబడి పరిగెత్తాయి. అంతే ఇంక, శివానందం, జగదీశ్వరి పరుగుపందెం వేసుకున్న వారిలా పోటీ పడి పరుగులు పెట్టారు. వీళ్ళ వేగం పెరిగినకొద్దీ కుక్కల వేగమూ పెరిగిపోతోంది.

చివరి కెలాగో ఇంట్లో వచ్చి పడ్డాక గానీ, ఇద్దరూ వూపిరి తీసుకోలేక పోయారు.

"అమ్మయ్యో పాడుకుక్కలు — ఎంత బెదిరించేశాయో!" అన్నది జగదీశ్వరి, మాటలు రానివాడిలా ఆయాసపడిపోతూ, కుర్చీలో కూలబడిన భర్తని చూస్తూ.

"బాబోయ్! చీకట్లో వెళ్ళటం తప్పయింది రేపట్నుంచి పూర్తిగా తెల్లారేకే వెళదామండీ."

• • •

'రేపు' ఈ రోజు—అయింది. అనుకున్నవిధంగా ఇవేళ ఆరింటికి బయలుదేరి, ఏ కుక్కల పీడాలేకుండా సురక్షితంగా తిరిగి ఇల్లు చేరుకున్నారు.

కాని వీళ్ళు ఇల్లు చేరటం, అప్పుడే వచ్చి తాళం పెట్టి ఉండటం చూసి సైకిల్ మీద వెనక్కి తిరిగి పోతున్న పాల అబ్బాయి అంత దూరాన కనిపించటం ఒక్కటే సారి జరిగాయి.

"అయ్యో పాలకుర్రాడు, పాలు ఇవ్వకుండా వెళ్ళి పోయాడండీ" అని జగదీశ్వరి ఆదుర్దా పడినా, శివానందం కేకలు వేసినా లాభం లేకపోయింది. తూనీగలా సైకిల్ మీద ఎగిరిపోతున్న పాలబ్బాయి వెనక్కి తిరిగి చూడనేలేదు.

పొద్దుటే పెద్ద గ్లాసుడు చిక్కని కాఫీ తాగక పోతే తలనొప్పి వచ్చేస్తుంది శివానందానికి. ఉసూరుమని ఇంట్లోకివెళ్ళి, భార్యతో ఫ్లాస్కు పుచ్చుకుని, డ్రెస్ మార్చుకుని వీధిన పడ్డాడు, కాఫీకోసం—'ఖర్మ, ఖర్మ' అని ఒకటికి, పదిసార్లు అనుకుంటూ.

• • • •

మూడవ రోజు పాల అబ్బాయికోసం—జగదీశ్వరి శివానందాన్ని ఒక్కణ్ణే రన్నింగ్‌కి పంపి తను ఇంట్లోనే ఉండిపోయింది.

పాలు వచ్చాయి. ముఖం కడుక్కుని, కాఫీ పెట్టుకుని తాగింది. అరగంట దాటినా శివానందం జాడ లేదు. ఒక్కరే ఎంత దూరం వెళ్ళారో, ఇంకా రాలేదేం అని వంట ప్రయత్నం కూడా తలపెట్టకుండా ఎదురుచూస్తూ కూర్చుంది జగదీశ్వరి.

గేటు దగ్గర భర్త కనిపించగానే ఎదురువెళ్ళింది. "ఇంతాలస్యం అయిందేమిటండి" అంటూ.

ఏదో నొప్పితో చాలా బాధ పడుతున్నట్లుంది అతని ముఖం. అయినా, 'ఏమండి! ఏమయిందండి" అంటున్న జగదీశ్వరికి సమాధానం ఇవ్వకుండా, కుంటుతూనే, లోపలికి వెళ్ళి మంచంమీద వాలిపోయాడు.

పరుగు పరుగున లోపలికొచ్చి చూసింది జగదీశ్వరి. కుడి మోకాలు దగ్గర తోలు లేచిపోయి అక్కడికక్కడే బాగా వాచిపోయింది.

"అయ్యో ఏమిటిది?కింద పడ్డారా?"

అవునన్నట్లు కళ్ళు మూసి తెరిచాడు శివానందం.

"ఎలా?" అతని జవాబుకోసం ఆగాడకుండా పరిగెత్తివెళ్ళి, నీళ్ళు డెట్టాల్ వేసుకుని వచ్చి, తోలులేచి దుమ్ము కొట్టుకున్న మేర శుభ్రంచేసింది. వేడి వేడి కాఫీ తెచ్చి అందించింది.

కాఫీ తాగాక అసలు విషయం బయటికొచ్చింది.

మరే, ఇవాళఇంకో ముసలాయన పరుగెత్తుతూ కన్పించాడు, జగదా అవతలి వీధిలో. ఎంత వేగంగా పరిగెడుతున్నా డనుకున్నావ్? యాభయ్యేళ్ళ ముసలిఆయన్ని, ముప్ఫయేళ్ళ పడుచువాణ్ణి బీట్ చేయలేనా అని పోటీగా, ముందు వెనక చూసుకోకుండా పరిగెత్తాను. ఆ టర్నింగ్‌లో బ్రిడ్జి లేదూ—అక్కడే పెద్దరాయొక్కటే, అడ్డం వచ్చి ..."

రాత్రయే సరికి ఇంకెంత లావుగా వాచిపోయిన భర్త కాలికి కాపడం పెడుతూ, అనుకుంది జగదీశ్వరి—"ఈ రన్నింగ్ ఈయనకి పనికిరాదు" అని.

ఆ వేళ మధ్యాహ్నం ఏదో పత్రికలో యోగాసనాలని గురించి ఒక వ్యాసం చదివింది జగదీశ్వరి. దాంతో కొత్త ఆలోచనలు వచ్చాయామెకి.

"ఏమండీ! వీధుల వెంట పరుగులు పెట్టే ఈ ఎక్సర్‌సైజు మానేసి, ఆసనాలు వెయ్యటం ఆరంభించండి. హాయిగా ఇంట్లోనే వేసుకోవచ్చు. యోగా వల్ల కూడా స్లిమ్‌గా అవుతారటండి. ఇప్పుడు కాదులే—కాలు కాస్త బాగయ్యాక చేద్దురుగానీ."

ముందు రన్నింగ్ వద్దనగానే అమ్మయ్య అని వూపిరి పీల్చుకున్న శివానందం యోగా అనగానే మళ్ళీ ఇదేం గొడవరా దేవుడా అనుకున్నాడు బాధగా.

"కాపడం పెట్టింది చాలుగానీ, ఇంక పడుకుందాం రా జగదా" అన్నాడు, ప్రసక్తి మారుస్తూ.

• • • •

శివానందానికిప్పుడు ఇంటికి రావటం అంటేనే భయంగా ఉంది. కాలు నొప్పి పూర్తిగా తగ్గటానికి వారం రోజులు పట్టింది.

ఇంక అప్పుడో ఇప్పుడో భార్య ఆసనాలు అని మొదలు పెడుతుందని తెలుసు. అందుకని ఇంకా కాస్త నొప్పి ఉన్నట్టుగానే నటిస్తున్నాడు. అయినా ఇట్లాంటి నటనలు అర్థంకానంత పిచ్చిదా జగదీశ్వరి.

ఆదివారం వచ్చింది. అందుకోసమే ఎదురు చూస్తోంది. శివానందం ఆఫీసుకు వెళ్ళనక్కరలేని రోజు—ఇద్దరికీ తొందర ఉండదు.

ఏడు గంటలకి నిద్రలేపింది భర్తని. ''ఆదివారమే కదా, అప్పుడేనా?'' అని గొణుగుతూనే లేచాడు శివానందం. ముఖం కడుక్కు రాగానే కాఫీ ఇవ్వకుండా డ్రాయింగ్ రూంలోకి తీసికెళ్ళింది. కుర్చీలన్నీ పక్కకి జరిపి, గది మధ్యలో చాప పరచింది.

''ఇవాళ మొదలు పెడదాం ఆసనాలు వేయటం'' అంటూ షార్ట్స్, బనియను అందించింది భర్తకి. మారు మాట్లాడకుండా బట్టలు మార్చుకుని చాప మీద చతికిల బడ్డాడు శివానందం.

తను చదివిన పత్రికలోంచి కట్ చేసుకున్న రక రకాల ఆసనాల ఫోటోలు బయటికి తీసింది జగదీశ్వరి.

''మొట్టమొదట వేయాల్సింది పద్మాసనం. చిన్నప్పుడు మా నాన్న వేయించేవారు మాకు. ఇదిగో ఇలా కుడికాలు మడిచి పాదాన్ని ఎడమ పక్కనించి పైకి లాక్కుని, ఇలా ఎడమకాలుని అదేవిధంగా మడిచి, ఇట్లా వేసుకోవాలి'' అని సునాయాసంగా కాళ్ళు మడిచి పద్మాసనం వేసి చూపెట్టింది జగదీశ్వరి.

శివానందం రెండుకాళ్ళూ బార జాచుకుని, కూచుని, జగదీశ్వరి చెప్పినట్లు కుడికాలు మడిచి, ఎడమ తొడమీదికి లాక్కున్నాడు. అంతవరకూ బాగానే ఉంది. ఎడమకాలు మడిచాడు కాని, పాదం పైకి రానంటూంది. దాన్ని గట్టిగా లాగబోతే కుడిపాదం కిందికి జారుతోంది.

''అలా జారనివ్వకండీ! కుడిపాదం ఇలా పట్టుకుని, ఎడమ పాదం పైకి నెప్పగా లాగాలి'' అని చెబుతూ సహాయంచేసి, ఎలాగో అవస్థపడి శివానందంతో పద్మాసనం వేయించింది జగదీశ్వరి.

''సరే. ఇదిగో ఈ ఫోటోలో అబ్బాయిలాగా స్ట్రెయిట్‌గా కూర్చుని బాగా గాలి పీల్చుకోండి. అహా అంత త్వరగా వదిలెయ్యద్దు. కాస్సేపలాగే బిగపట్టి కూర్చోండి. వదిలేటప్పుడు కూడా అలాగే నిదానంగా ఒదలాలి అలా నాలుగైదుసార్లు చేయండి''

చెప్పినట్లు చేశాడు శివానందం. ''ఇవాల్టికి చాల్లే జగదా!'' అన్నాడు, మెల్లిగా కాళ్ళు వదులుచేస్తూ.

''అప్పే అప్పుడేనా, ఇంకొక్క రకం అయినా చేయండి. ఇదిగో ఈ బొమ్మలో ఉందే—ఇట్లా చేయండి'' అంటూ ఒక ఫోటో చూపించింది.

కాళ్ళురెండూ చాచుకు కూర్చొని, చేతులతో కాళ్ళ బొటన వ్రేళ్ళు అందుకోవాలి.

కాళ్ళు రెండూ చాచి కూర్చుని ప్రయత్నించాడు శివానందం. ''అహ అలా మోకాళ్ళు మడవకుండా అందుకోవాలండీ—ఇదిగో ఇలా'' అని బొమ్మ చూపించింది జగదీశ్వరి.

బొజ్జ అడ్డం వచ్చి నడుం ఒంగనంటుంది. అలాగే కష్టపడి ఒంచి, ఊపిరి బిగించి వేళ్ళు అందుకోబోయాడు శివానందం. అంతే, హఠాత్తుగా, ''అమ్మో నడుం విరిగింది'' అని కేకవేసి నిరుచుకు పడిపోయాడు.

• • • •

మంచం మీద బోర్లా పడుకుని ఉన్నాడు శివానందం. ఫామిలీ డాక్టర్ రాసిచ్చిన, ఆయుర్వేద తైలాన్ని చేతికి రాసుకుని, భర్త నడుంని సున్నితంగా ఒత్తి మర్దనా చేస్తూ పక్కనే కూర్చుని ఉంది జగదీశ్వరి. ఆమె ముఖం తప్పుచేశానన్న భావంలో చిన్నబోయి ఉంది. అసలు డాక్టర్ కండరం పట్టేసిందే తప్ప, భయపడాల్సిందేమీ లేదని చెప్పేదాకా ఆమె మనసు మనసులో లేదు.

''ఏమండీ, చాలా నొప్పా?''

''లేదు. పోనీ తగ్గిపోతుందిలే నువ్వేమిటి దివాలా తీసినట్టు ముఖం పెట్టుకున్నావ్. నీ ఆశ నిరాశ అయిందనా? ఏం చేసేది చెప్పు జగదా! నీవు చెప్పిన చిట్కా లేవీ నాకు అచ్చిరావటం లేదే! పోనీ నో పని చేస్తే ... నువ్వే లావు అయి నాకు మేచ్ అయేలా తయారయితే సరిపోదూ? ఆ పని సుభం అనుకుంటాను.''

ఆలోచనలో పడిపోయింది జగదీశ్వరి. ★




తయారు చేయువారు:
సూపర్ కెమ్ ఇండస్ట్రీస్
బెంగుళూరు 560 058

అమ్మకపుదారులు:
'మామా'
ఈనాడు కాంపౌండ్, హైదరాబాదు-500 004.